నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
5 | బుధవారం 17 జనవరి 2024 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD

నేషనల్ యూత్ ఫెస్టివల్‌లో ప్రథమ స్థానం

నాసిక్‌లో గిరిజన నృత్యం చేస్తున్న రాజీవ్‌నగర్ మోడల్ స్కూల్, కాలేజీ విద్యార్థినులు

మంచిర్యాల అర్బన్, జనవరి 16 : నాసిక్‌లో ఈ నెల 12న నిర్వహించిన నేషనల్ యూత్ ఫెస్టివల్‌లో మంచిర్యాలలోని రాజీవ్‌నగర్ మోడల్ స్కూల్, కాలేజ్ విద్యార్థినులు నృత్యంలో ప్రతిభ చూపారు. నాయక్ పోడ్‌కు సంబంధించిన గిరిజన నృత్యం ప్రదర్శించగా ప్రథమ స్థానంలో నిలిచినట్లు ప్రిన్సిపాల్ రజిని వివరించారు.

ఆకట్టుకున్న అయోధ్య రామ మందిరం ముగ్గు

భీమారం, జనవరి 16 : మండల కేంద్రంలోని జయశంకర్ కాలనీకి చెందిన పిట్టల స్వప్న అయోధ్య రామమందిరం రూపంలో వేసిన ముగ్గు ఆకట్టుకున్నది. రామ మందిరంపై పక్షులు ఎగురుతున్నట్లు, హరిదాసు పాట పడుతున్నట్లు, ఆ పక్కనే చిన్నారి పతంగి ఎగిరేస్తున్నట్లు వేసిన ముగ్గు వాట్సప్‌లో వైరల్‌గా మారింది. స్వప్నను పలువురు అభినందించారు.

అయోధ్య రామమందిరం ముగ్గు

ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు నిర్వహణ నిధులు

- 10 కాలేజీలకు రూ. 1.37 లక్షలు విడుదల

ప్రభుత్వ జూనియర్ కళాశాల

మంచిర్యాల అర్బన్, జనవరి 16 : జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు నిర్వహణ నిధులు మంజూరయ్యాయి. 2023-24 విద్యా సంవత్సరానికి మొదటి విడుతగా ఆగస్టులో నిధులు మంజూరు చేయగా, తాజాగా రెండో విడుత నిధులు విడుదల చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

10 జూనియర్ కళాశాలలకు రూ. 1.37 లక్షలు..

మంచిర్యాల జిల్లాలో 10 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఉండగా, ఇందులో 3,629 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. కళాశాలల్లో విద్యార్థుల సంఖ్య ఆధారంగా ప్రతి విద్యార్థికి ఆరు నెలలకోసారి రూ.38 చొప్పున విడుదల చేస్తారు. కళాశాల ఆవరణ, తరగతి గదులను శుభ్రం చేయడం, సుద్ద ముక్కలు(చాక్‌పీసులు), రిజిష్టర్లు, చీపుర్లు, తరగతి గదుల్లో లైట్లు, ఫ్యాన్లు తదితర వాటి నిర్వహణకు ఈ నిధులు వెచ్చిస్తారు. ఈ మేరకు 3,629 మందికిగాను రూ.1,37,902 ప్రభుత్వం మంజూరు చేసింది.

ఆకట్టుకున్న ఎడ్లబండ్ల పోటీలు

విజేతకు బహుమతి అందిస్తున్న పోటీల నిర్వాహకులు

సీసీసీ నస్పూర్, జనవరి 16 : సంక్రాంతి పండుగ సందర్భంగా నస్పూర్ మున్సిపాలిటీ పరిధిలోని నీతారాంపల్లిలో సోమవారం నిర్వహించిన ఎడ్లబండ్ల పోటీలు ఆకట్టుకున్నాయి. జీవీ సుధాకర్‌రావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీల్లో నస్పూర్, మంచిర్యాల, హాజీపూర్, భీమారం, జైపూర్, తదితర మండలాల రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. హోరాహోరీగా సాగిన ఈ పోటీల్లో బూరుగుపల్లి గ్రామానికి చెందిన భూక్య దసురు విజయం సాధించగా, పాత మంచిర్యాలకు చెందిన మహేశ్ యాదవ్ ద్వితీయ స్థానం, గుడిపేటకు చెందిన శ్రీరామ్ తృతీయ స్థానం, టేకులపల్లి గ్రామానికి చెందిన గంగాధరి లక్కీ నాలుగో స్థానంలో చిలిచారు. స్థానిక కౌన్సిలర్ సుర్మిళ్ల వేణు, నిర్వాహకులు పొనగోటి రంగారావు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు ధర్ని మల్లేశ్, కొక్కిరాల అరుణ్‌రావు పాల్గొన్నారు.

వలసొచ్చి.. వరి నాట్లేస్తూ..

- బృందాలుగా ఏర్పడి జోరుగా వ్యవసాయ పనులు
- ప్రతి రోజూ ఆరెకరాలకుపైగా వరి నాట్లు
- తగ్గుతున్న వ్యయం.. ఆసక్తి చూపుతున్న రైతులు
- పత్తి తీత, రైస్‌మిల్లులు, భవన నిర్మాణ రంగాల్లోనూ పాల్గొంటూ..

తెలంగాణ బాట పడుతున్న ఇతర రాష్ట్రాల కూలీలు

నాటువేస్తున్న వలస కూలీలు

మంచిర్యాల అర్బన్, జనవరి 16 : కేసీఆర్ సర్కారు వ్యవసాయాన్ని పండుగలా మార్చింది. ప్రాజెక్టుల నిర్మాణం, చెరువుల పూడికతీతతో పాటు 24 గంటల ఉచిత విద్యుత్, రైతుబంధువంటి పథకాలు తీసుకొచ్చి బీడు భూములన్నీ సస్యశ్యామలంగా మార్చింది. ఇక్కడి రైతులతో పాటు కూలీలకు చేతినిండా పనిదొరుకుతుండగా, ఇతర రాష్ట్రాల వారికి సైతం ఉపాధి చూపినట్లైంది. ఉత్తరప్రదేశ్, పశ్చిమబెంగాల్, బీహార్, జార్ఖండ్, ఒడిశా, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర తదితర రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో తరలివస్తున్న కూలీలు వరి, పత్తి చేలల్లో పనులు చేస్తూ సంపాదించుకుంటున్నారు. మరోవైపు రైస్ మిల్లులు, భవన నిర్మాణ రంగాల్లో సైతం పని చేస్తున్నారు.

ప్రతి రోజూ ఆరెకరాలకు పైగా..

ఒకరోజులో స్థానికులు మూడు నుంచి నాలుగెకరాల్లో నాటు వేస్తుండగా, అదే వలస కూలీలు మాత్రం ఆరు నుంచి ఎనిమిది ఎకరాల్లో నారు పీకి, నాట్లు వేస్తున్నారు. మరోవైపు ఎకరంలో నాటు వేయాలంటే స్థానికులు గంపగుత్తగా రూ. 5 వేలు తీసుకుంటారు. దీనికి అదనంగా పీకిన నారును అందించేందుకు మరో ఇద్దరు అవసరం. వీరికి అదనంగా మరో రూ. 2 వేలు ఖర్చవుతాయి. ఈ లెక్కన ఎకరానికి రూ. 7 వేల దాకా ఖర్చవుతుంది. అదే వలస కూలీలతో నాటు వేయిస్తే వ్యయం తగ్గుతుంది. నారు పీకడం, కట్టలు కట్టడం, నాటు వేసే వారికి పంచడం, నాటు వేయడం అంతా కలిపి మొత్తంగా ఎకరానికి రూ. 4500 తీసుకుంటున్నారు. దీంతో రైతుకు ఎకరానికి దాదాపు రూ. 2500 ఆదా అవుతున్నాయి. దీంతో స్థానిక రైతులు వలస కూలీలతో నాటు వేయించేందుకు ఆసక్తి చూపుతున్నారు.

నాలుగేండ్ల సంది తెలంగాణకు వస్తున్నం

మాది యూపీలోని పిలిబిత్ జిల్లా. నాలుగేండ్ల సంది తెలంగాణకు వచ్చి వ్యవసాయ పనులు చేసుకుంటున్నం. ఒక్క మా జిల్లా నుంచే 400 మందికి పైగా వచ్చినం. మంచిర్యాలతో పాటు కరీంనగర్, నిజామాబాద్, జగిత్యాల, పెద్దపల్లి, నిర్మల్, సిరిసిల్ల జిల్లాల్లో వరి, పత్తి తీత పనులు చేస్తున్నం. మాకు ఓ ఏజెంటు ఉన్నడు. ఆయన ఎక్కడ పని ఉంటే అక్కడికి పంపిస్తడు. మా రాష్ట్రంలో రోజంతా పని చేస్తే రూ. 400 నుంచి రూ. 600 దాకా ఇస్తరు. అదే తెలంగాణలో ఒక్కొక్కరికీ దాదాపు రూ. 1200పైనే కూలి పడుతుంది. అందుకే మావోళ్లంతా తెలంగాణకు లైను కడుతున్నరు. సీజన్‌ల నెలన్నర నుంచి రెండు నెలలు దాకా పని దొరికితే చాలు. మళ్లీ ఇంటికి పోయినంక చిన్న చిన్న పనులు చేసుకుంటం. మంచిర్యాల జిల్లాకు 14 మందిమి ఒక టీమ్‌గా వచ్చినం.

- కార్తిక్, పిలిబిత్ జిల్లా, ఉత్తరప్రదేశ్

ఇప్పటికే 250 ఎకరాల్లో నాటు వేసినం

మేము ఇక్కడకు వచ్చి నెలైతంది. మాకు చేతి నిండా పని దొరుకుతుంది. రైతులు మా వద్దకు ట్రాక్టర్లు, ట్రాలీలు, ఆటోలతో వచ్చి వారి పొలాల వద్దకు తీసుకుపోతున్నరు. రోజుకు ఆరెకరాలకుపైగా నాట్లు వేస్తున్నం. ఇప్పటి వరకు దాదాపు 250 ఎకరాల దాకా నాట్లు వేసినం. మూరెడుకు మూడుచోట్ల పిలకలు నాటుతున్నం. ఇలా వేయడం వల్ల పంట దిగుబడి బాగా వస్తది. దీంతోనే ఒక సారి నాటు వేయించుకున్న రైతులు మళ్లా మమ్ముల్నే కావాలని అడుగుతున్నరు. రైతులు మంచిగుంటేనే మాలాంటి కూలీలకు ఇన్ని డబ్బులు దొరుకుతయి. మా రాష్ట్రంలో పనులు దొరకడం కష్టం. ఇక్కడ చేతి నిండా పనే. ఏడాదికి రెండుసార్లు ఇక్కడికొస్తే ఏడాదంతా గడపొచ్చు.

- తరుణ్, పిలిబిత్ జిల్లా, ఉత్తరప్రదేశ్

డబ్బులు ఆదా అయినయ్

నాకు ఆరెకరాల భూమి ఉంది. దీని కితోడు మరో 16 ఎకరాలు కౌలుకు తీసుకున్న. ఇక్కడ నాటు వేసేందుకు కూలీలు దొరకలే. అందుకే వలస కూలీలను ఇక్కడికి రప్పించిన. మొత్తం 22 ఎకరాలు వేయించుకున్న. నా కోసం తీసుకొచ్చుకున్న లేబర్లు మా ఊరిలో 250 ఎకరాల్లో నాట్లు వేసిన్రు. సమయంతో పాటు డబ్బులు కూడా ఆదా అయినయ్. ఇక నుంచి ప్రతి సీజన్‌లో వీరితోనే నాట్లు వేయిస్తా.

- గంగాధర్‌రెడ్డి, రాజేశ్వర్‌రావుపల్లె, హాజీపూర్

క్రీడలతో స్నేహం పెరుగుతుంది

- మంచిర్యాల డీసీపీ సుధీర్ రాంనాథ్ కేకన్

ఫ్రెండ్లీ కప్‌ను అందుకుంటున్న మంచిర్యాల డీసీపీ సుధీర్ రాంనాథ్ కేకన్

మందమర్రి, జనవరి 16 : క్రీడలతో మానసికోల్లాసంతో పాటు స్నేహ సంబంధాలు పెరుగుతాయని మంచిర్యాల డీసీపీ సుధీర్ రాంనాథ్ కేకన్ అన్నారు. మందమర్రి పట్టణంలోని సింగరేణి ఉన్నత పాఠశాల ఆవరణలో పోలీసు అధికారుల స్నేహ పూర్వక క్రికెట్ టోర్నీని ఆయన ప్రారంభించారు. మంచిర్యాల, బెల్లంపల్లి, జైపూర్ సబ్ డివిజన్ జట్లతో పాటు మంచిర్యాల డీసీపీ జట్టు పాల్గొంది. డీసీపీ జట్టు విజయం సాధించి ఫ్రెండ్లీ కప్ కైవసం చేసుకుంది. డీసీపీ సుధీర్ రాంనాథ్ కేకన్ మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచారు. పాఠశాలల్లో విద్యార్థులకు క్రీడల్లో తగు శిక్షణ ఇచ్చి ప్రోత్సహించాలని సూచించారు. బెల్లంపల్లి ఏసీపీ పంతాటి సదయ్య, మంచిర్యాల ఏసీపీ తిరుపతి రెడ్డి, జైపూర్ ఏసీపీ మోహన్, జిల్లాలోని అన్ని సర్కిల్‌ల సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

ఎన్నికల అధికారుల నియామకం

హాజీపూర్, జనవరి 16 : జిల్లాలోని చెన్నూర్, లక్షెట్టిపేట, బెల్లంపల్లి, కన్నెపల్లి, మందమర్రి, మంచిర్యాల తెలంగాణ నాన్ గెజిటెడ్ (టీఎన్జీవో) యూనిట్ల అధ్యక్షుల పదవీ కాలం ముగుస్తుందని, ఈ నెలలో కొత్త కార్యవర్గాలను ఎన్నుకునేందుకు ఎన్నికలు నిర్వహించనున్నట్లు జిల్లా అధ్యక్షుడు గడియారం శ్రీహరి ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 28న చెన్నూర్ యూనిట్‌కు చెన్నూర్‌లోని ఫారెస్టు కాంప్లెక్స్‌లో, లక్షెట్టిపేట యూనిట్‌కు లక్షెట్టిపేట ఐబీ గెస్ట్‌హౌస్‌లో, బెల్లంపల్లి యూనిట్‌కు బెల్లంపల్లి తహసీల్దార్ కార్యాలయంలో, 29న మందమర్రి యూనిట్‌కు స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో, కన్నెపల్లి యూనిట్‌కు స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో, 30న మంచిర్యాల యూనిట్‌కు స్థానిక టీఎన్జీవో భవన్‌లో ఎన్నికలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. చెన్నూర్ యూనిట్ ఎన్నికల అధికారిగా చెన్నూర్ అటవీశాఖ కార్యాలయ సూపరింటెండెంట్ పొన్న మల్లయ్య, లక్షెట్టిపేట యూనిట్ ఎన్నికల అధికారిగా డిప్యూటీ తహసీల్దార్ సతీశ్‌కుమార్, బెల్లంపల్లి, కన్నెపల్లి యూనిట్లకు డిప్యూటీ తహసీల్దార్ కే శ్రీనివాస్, మందమర్రి యూనిట్‌కు పంచాయతీ కార్యదర్శి బీ శ్రావణ్‌కుమార్, మంచిర్యాల యూనిట్‌కు అటవీశాఖ కార్యాలయ సూపరింటెండెంట్ పొన్న మల్లయ్యను నియమించినట్లు శ్రీహరి తెలిపారు.

గొంతెమ్మ ఆలయం చుట్టూ బోనాలతో ప్రదక్షిణ చేస్తున్న భక్తులు

వైభవంగా గొంతెమ్మ బోనాల పండుగ

పెంచికల్‌పేట్, జనవరి 16 : ఎల్లూరు గ్రామ పంచాయతీ పరిధిలోని మేరగూడ అటవీ ప్రాంతంలో వెలసిన గిరిజనుల ఆరాధ్య దైవం గొంతెమ్మ బోనాలను సోమవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయ పూజారి మానెపల్లి రాజన్న ఆధ్వర్యంలో కొత్త వడ్ల బియ్యం, బెల్లంతో బోనం వండి మొక్కులు తీర్చుకున్నారు. భాజాభజంత్రీల నడుమ లక్ష్మీదేవర, ఇతర దేవతల ఆలయాల చుట్టూ ప్రదక్షిణలు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ కమిటీ వారు అన్ని ఏర్పాట్లు చేశారు. అనంతరం అన్నదానం చేశారు. ఎస్ఐ కొమురయ్య ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

ముగిసిన రాష్ట్రస్థాయి హ్యాండ్ బాల్ పోటీలు

- తృతీయ స్థానంలో ఆదిలాబాద్ జట్టు

విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న రాష్ట్ర హ్యాండ్ బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సామల పవన్‌కుమార్, జిల్లా ప్రధాన కనపర్తి రమేశ్

ఆసిఫాబాద్ టౌన్, జనవరి16 : జిల్లా కేంద్రంలోని గిరిజన ఆశ్రమ ఆదర్శ క్రీడా బాలికల పాఠశాలలో నిర్వహిస్తున్న 45వ తెలంగాణ రాష్ట్ర స్థాయి అండర్-19 బాలికల హ్యాండ్ బాల్ పోటీలు మంగళవారం ముగిశాయి. రాష్ట్ర హ్యాండ్ బాల్ సంఘం ప్రధాన కార్యదర్శి సామల పవన్‌కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి కనపర్తి రమేశ్, క్రీడా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కృష్ణారావు మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహించినందుకు సంతోషంగా ఉందన్నారు. రంగారెడ్డి జట్టు విజేతగా నిలువగా, వరంగల్ జట్టు ద్వితీయ స్థానంలో, ఆదిలాబాద్ జట్టు తృతీయ స్థానంలో నిలిచింది. ఈ నెల 27 నుంచి 31వ తేదీ వరకు బిహార్ రాష్ట్రంలో జరిగే జాతీయస్థాయి పోటీల్లో ఈ క్రీడాకారులు పాల్గొంటారన్నారు. గెలుపొందిన జట్లను హ్యాండ్ బాల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు గోనే శ్యామ్ సుందర్ రావు, జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారులు రమాదేవి, జిల్లా గిరిజన క్రీడల అధికారి మీనారెడ్డి, జీసీడీవో శకుంతల, ఏసీఎంవో ఉద్ధవ్ అభినందించారు. ఈ కార్యక్రమంలో హ్యాండ్ బాల్ సంఘం వివిధ జిల్లాల కార్యదర్శులు లక్ష్మణ్, శంకర్, తిరుమల్, టోర్నమెంట్ పర్యవేక్షకుడు దీపక్ ప్రసాద్, తెలంగాణ రెఫరీ బోర్డు చైర్మన్ ఇంద్రసేనారెడ్డి, టోర్నమెంట్ ఆర్గనైజర్లు కడతల రాకేశ్, విష్ణుకాంత్ ఆచార్య, కోచ్‌లు అరవింద్ సునార్కర్, సుధీర్, తిరుమల్, మీనా, పద్మిని, పీడీ సదానందం, పీఈటీలు కళ్యాణ్, సాయి, రమేశ్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

'జన్‌మన్'తో గిరిజనుల అభ్యున్నతి

- కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు, ఎమ్మెల్యే కోవ లక్ష్మి

ఆసిఫాబాద్ అంబేద్కర్‌చౌక్, జనవరి 16 : ప్రధానమంత్రి జన్‌జాతి ఆదివాసీ న్యాయ మహా అభియాన్ (జన్‌మన్) పథకం ద్వారా గిరిజనుల అభ్యున్నతికి కృషి చేస్తున్నట్లు కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు, ఎమ్మెల్యే కోవ లక్ష్మి అన్నారు. సోమవారం దేశవ్యాప్తంగా జన్‌మన్ పథకం ప్రారంభించిన సందర్భంగా జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్లు దీపక్ తివారీ, దాసరి వేణు, జిల్లా అధికారులు, ఆదివాసులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్, ఎమ్మెల్యే కోవ లక్ష్మి మాట్లాడుతూ జిల్లాలోని 149 గ్రామాల్లో గృహ నిర్మాణాలు, స్వచ్ఛమైన తాగునీరు, పారిశుద్ధ్యం, మెరుగైన విద్య, పోషకాహారం, విద్యుత్, రహదారులు, టెలికాంవంటి ప్రాథమిక సౌకర్యాలు కల్పించనున్నట్లు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందేలా చూస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివాస్, ఎంపీపీ అరిగెల మల్లికార్జున్, రెబ్బెన జడ్పీటీసీ సంతోష్, జిల్లా ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు, ఎమ్మెల్యే కోవ లక్ష్మి

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు

ఓటరు జాబితా రూపకల్పనలో పార్టీల పాత్ర కీలకం

- కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు

ఆసిఫాబాద్ టౌన్, జనవరి 16 : ఓటరు జాబితా రూపకల్పనలో రాజకీయ పార్టీల పాత్ర కీలకమైనదని కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు అన్నారు. పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో మంగళవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ దాసరి వేణు, ఆర్డీవో సురేష్‌తో కలిసి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 20, 21 తేదీల్లో జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తామన్నారు. 18 ఏళ్లు నిండిన వారందరూ ఓటరుగా నమోదు చేసుకునేందుకు, మరణించిన వారి పేర్లు జాబితా నుంచి తొలగించేందుకు నేతలు సహకరించాలని కోరారు. పేర్లు, చిరునామా ఇతర వివరాల సవరణ కోసం అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఎన్నికల విభాగం అధికారులు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి స్పందన

కౌటాల, జనవరి 16 : మండల కేంద్రంలోని జాన్వీ విజన్ కేర్‌లో మంగళవారం నిర్వహించిన కంటి వైద్య శిబిరానికి స్పందన వచ్చింది. కౌటాల, చింతలమానెపల్లి, బెజ్జూర్ మండలాలకు చెందిన 36 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు అందించారు. కొందరికి ఆపరేషన్ అవసరముందని జేఆర్ సర్కార్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ నారాయణ సర్కార్, డీవోఏ సీమా సర్కార్ తెలిపారు. ప్రతి మంగళవారం ఉచితంగా కంటి పరీక్షలు చేస్తామని, ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

పరీక్షలు చేసిన వారితో జాన్వీ క్లినిక్ సిబ్బంది

ఎస్ఐ విక్రమ్‌కు వినతి పత్రం అందజేస్తున్న మహిళలు

గుడుంబా, బెల్టు షాపులను బంద్ చేయాలి

బెజ్జూర్, జనవరి 16 : బెల్ట్ షాపులతో పాటు గుడుంబా తయారీ కేంద్రాలను మూసి వేయించాలని ఉమ్మడి మర్తిడి గ్రామ పంచాయతీ మహిళలు మంగళవారం ఆందోళన చేపట్టారు. మర్తిడి, లంబాడీగూడ, బొగడగూడ తదితర ఆవాస గ్రామాల మహిళలు ఆందోళనకు దిగారు. అనంతరం మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌కు చేరి ఎస్ఐ విక్రమ్‌కు వినతి పత్రం అందజేశారు. వెంటనే గుడుంబా విక్రయ కేంద్రాలతో బెల్ట్ షాపులను బంద్ చేయించాలని విజ్ఞప్తి చేశారు.

పోడు పట్టాలివ్వాలని కలెక్టర్‌కు వినతి

రెబ్బెన, జనవరి 16 : పోడు పట్టాలివ్వాలని నంబాల గ్రామ సర్పంచ్ చెన్న సోమశేఖర్ కోరారు. ఈ మేరకు మంగళవారం జిల్లా కేంద్రంలో కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావుకు వినతిపత్రం అందించారు. గతంలో నంబాల గ్రామ పంచాయతీలో ఎస్టీలకు పోడు పట్టాలు అందించారని పేర్కొన్నారు. ఇంకా 30 మందికి పట్టాలు అందలేదని, వారికి న్యాయం చేయాలని కోరారు.

జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు కు వినతిపత్రం అందిస్తున్న నంబాల సర్పంచ్ చెన్న సోమశేఖర్